బీఆర్ఎస్‌కు ఓటేస్తేనే భవిష్యత్తు

కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే మురుగు కాల్వలో వేసినట్టే ● జాతీయ పార్టీలతో తెలంగాణకు ద్రోహం ● తెలంగాణ ఆకాంక్షను దెబ్బ తీసిన కాంగ్రెస్

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర ● బహుజనవాదం, తెలంగాణవాదం కలవాలి ఈ రెండూ కృష్ణా-తుంగభద్రల్లాంటివి ● ప్రాంతీయ పార్టీలకే రాష్ట్రాలపై ధ్యాస

● కందనూలును నైపుణ్య రాజధాని చేస్తా ● నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ (special interview)

నాగర్‌కర్నూల్, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'రెండు జాతీయ పార్టీలతో తెలంగాణకు ద్రోహం జరిగింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తేనే భవిష్యత్తు ఉంటుంది. కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే మురుగు కాల్వలో వేసినట్టే. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతున్నది. ఇదే జరిగితే దేశంలో మతకల్లోలాలు చెలరేగుతాయి. తెలంగాణ ఆకాంక్షను కాంగ్రెస్ దెబ్బతీసింది. రాష్ట్రానికి ఏమీ చేయని కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అంటున్నారు నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. తన లక్ష్యమైన బహుజనవాదం, కేసీఆర్ లక్ష్యమైన తెలంగాణ వాదాన్ని ముందుకు తీసుకెళ్లేందుకే బీఆర్ఎస్‌లో చేరినట్టు చెబుతున్న ఆర్ఎస్పీతో 'నమస్తే తెలంగాణ'ప్రత్యేక ఇంటర్వ్యూ....

ఎంపీగా పోటీ చేస్తానని అనుకున్నారా?

ఏ మాత్రం అనుకోలేదు. కొంత యాదృచ్ఛికంగానే జరిగింది. బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తు ద్వారా ముందుకు పోదామనుకున్నాం. కానీ బీజేపీ కుట్రలతో అది భగ్నమైంది. కేసీఆర్‌కు, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బహుజనవాదం, తెలంగాణవాదం కలవాల్సి ఉన్నది. ఈ రెండూ కృష్ణా-తుంగభద్రల్లాంటివి. కేసీఆర్‌కు ఇచ్చిన మాట, ఆలోచన మేరకు నేను బీఆర్ఎస్‌లో చేరా. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తా అన్న ఆలోచన ఆరు నెలల ముందు వరకు లేకుండె. ఈ ప్రయత్నంలో విజయం సాధిస్తానని నమ్ముతున్నా.

ప్రచారంలో ఎలాంటి స్పందన వచ్చింది?

ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి ఆదరణ వచ్చింది. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైతం నన్ను గుండెల్లో పెట్టుకున్నారు. స్వచ్ఛందంగా నా గెలుపు కోసం పని చేరు.

మీరు గుర్తించిన సమస్యలేంటి?

ప్రధానంగా వలస సమస్య ఉన్నది. కేసీఆర్ రాకముందు వేరే రాష్ట్రాలకు వలసవెళ్లేవారు. ఇప్పుడు హైదరాబాద్, ఇతర పట్టణాలకు వెళ్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను ఈ సమస్య వేధిస్తున్నది. చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు లేకపోవడం, నైపుణ్యాలు లేకపోవడం ప్రధాన సమస్య. కేసీఆర్ వచ్చాక సాగునీటి సమస్య తీరింది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు లేకపోవడం సమస్య.

ఢిల్లీ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు ఉన్నాయా?

ఢిల్లీలో కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించి 2,100 పథకాలు ఉంటాయి. వీటితో పార్లమెంట్ నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేయవచ్చు. ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, పైలట్ ప్రాజెక్టుగా నాగర్‌కర్నూల్‌ను ఎంపిక చేసేలా కేంద్రాన్ని ఒప్పిస్తా, అవసరమైతే పోరాడుతా. నాగర్‌కర్నూల్‌కు పెద్దమొత్తంలో నిధులు తీసుకొస్తా. ఢిల్లీలో వేల కోట్ల నిధులుంటాయి. వాడుకోవాలన్న స్పష్టత, చైతన్యం ఉండదు. నేను ఐపీఎస్ సర్వీసులో ఉన్నా కాబట్టి అధికారుల సహకారంతో ఈ ప్రాంతాన్ని గొప్పగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యం, మోసం, దోపిడీ, గ్యారెంటీల పేరుతో చేస్తున్న గారడీ విధానాలను ఎండగట్టడం చాలా ముఖ్యం. ప్రజల గొంతుకగా చట్టసభల్లో మాట్లాడాల్సి ఉన్నది.

జాతీయ పార్టీలతోనే అభివృద్ధి అనే మాటపై మీ అభిప్రాయం..?

ఇది చాలా మంచి ప్రశ్న. జాతీయ పార్టీలతో తెలంగాణకు ద్రోహమే జరిగింది. చాలా రాష్ట్రాలు ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి చెందాయి. తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి అయ్యాయి. ప్రాంతాలను దోచుకోవడం, పార్టీని నడుపుకోవడం కోసమే మనల్ని జాతీయ పార్టీలు ఉపయోగించుకుంటున్నాయి. అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వవు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి ఘోరమైన అన్యాయం జరిగింది. తెలంగాణ కలను కాంగ్రెస్ భగ్నంచేసింది. శ్రీభాగ్ ఒడంబడిక, పెద్దల ఒప్పందం పేరుతో తెలంగాణ ప్రజల మెడలు వంచింది. చెన్నారెడ్డి టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో కలుపుకొని తెలంగాణ ప్రజల ఆకాంక్షను నాశనం చేసింది. మోదీ కూడా తెలంగాణకు చేసింది జీరో. ప్రాంతీయ పార్టీలకు రాష్ట్రంపైనే ధ్యాస ఉంటది. కాళేశ్వరం, మిషన్‌కాకతీయ,మిషన్‌భగీరథ, గురుకులాలు, ఐటీ కారిడార్, హైదరాబాద్ అభివృద్ధి ప్రాంతీయ పార్టీ వల్లే జరిగిందనేని జగమెరిగిన సత్యం. ప్రాంతీయ పార్టీలకు ఓటేస్తేనే మన బిడ్డల భవిష్యత్తును కాపాడుకోవచ్చు. సారవంతమైన నేలలో విత్తనం వేసినట్లే అవుతుంది.

వారసత్వ రాజకీయాలపై మీ వైఖరి?

వారసత్వ రాజకీయాలకు ప్రాధాన్యత ఉంటుందనుకోను. ప్రతిభ మీదనే మంత్రులు, ముఖ్యమంత్రులు అవుతారు. ఎవరు బాగా పని చేస్తరు, ఎవరు బాగా పని చేయరనేది దేశ యువత అంతా చూస్తున్నది. బలవంతంగా ఈయననే మీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే అని రుద్దితే ప్రజలు అంగీకరించరు. మల్లు అనంత రాములు ఎంపీ అయినంత మాత్రాన మల్లు రవిని, రాములు కొడుకైనంత మాత్రాన భరత్‌ను ఆదరిస్తరనుకోను. సొంత శ్రమతోనే వ్యక్తులు పైకి రావాలి. వారసత్వంతో పైకి వస్తారనే రోజులు పోయాయి.

సివిల్ సర్వెంట్‌గా ఉన్న మీరు ఏం సాధించాలని రాజకీయాల్లోకి వచ్చారు?

ఈ ప్రాంత బిడ్డలను నాకంటే గొప్పగా బాగు చేస్తా. ఉద్యోగాల కోసం కేంద్రంతో కుస్తీ పడుతా. నాగర్‌కర్నూల్ ప్రాంతాన్ని నైపుణ్యాలకు రాజధాని చేస్తా. రాజస్థాన్ ఐఐటీ కోచింగ్ కేంద్రం లాగా నాగర్‌కర్నూల్, వనపర్తిని మార్చేందుకు కృషి చేస్తా. నల్లమల అటవీ ప్రాంతాన్ని ఎకో టూరిజం కేంద్రంగా చేయవచ్చు. ఆదిమ జాతులను ప్రపంచ పటంలోకి తీసుకెళ్లొచ్చు. బంజారా బిడ్డలకు ఏకలవ్య మోడల్ స్కూల్స్, అగ్రికల్చర్, ఫిషరీస్ కాలేజీలకు అనుబంధంగా పరిశ్రమలు తీసుకొచ్చేందు కు కృషి చేస్తా. చిరకాల కోరికైన వనపర్తి-డోర్నకల్, అలంపూర్-గద్వాల రైలు, అలంపూర్-కర్నూలు బ్రాడ్‌గేజ్ డబుల్ లైన్, అలంపూర్, గద్వాల, వనపర్తి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ కోసం పాటుపడుతా. తెలంగాణ,ఏపీ, కర్ణాటక రాష్ట్రాల కూడలి అయినందున నదులపై వంతెన, నాలుగు వరుసల జాతీయ రహదారి ఏర్పాటు చేయాల్సి ఉన్నది. పారిశ్రామిక కారిడార్, ఏరో స్పేస్, ఐటీ కారిడార్లు ఏర్పాటు చేయొచ్చు. పార్లమెంట్ పరిధిలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, అలంపూర్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, అయిజ వంటి ప్రాంతాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ తీసుకుంటా. 24 గంటలు కోచింగ్ కేంద్రాలు, చిన్న పిల్లల కోసం బేబీ లెర్నింగ్ కేంద్రాలను ఇటాలియన్, యూరోపియన్ మోడల్‌లో పెట్టాలనున్నది. స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక రుగ్మతలు, మహిళల మీద కనిపించని అఘాయిత్యాలు తగ్గించడంతోపాటు పేదలకు లీగల్ అసిస్టెంట్ కేంద్రాలు నెలకొల్పాలనున్నది. మనిషి జీవన ప్రమాణాలు 60-65ఏళ్ల నుంచి 70-80సంవత్సరాల పాటు హాస్పిటళ్లకు వెళ్లకుండా కాల్ సెంటర్ పెట్టి దేశంలోనే హ్యాపీనెస్ క్యాపిటల్‌గా చేయాలని అనుకుంటున్నా.

నల్లమలలో యురేనియం తవ్వకాలు చేపట్టాలని కేంద్రం చేస్తున్న ప్రయత్నాలపై మీ వైఖరి?

యురేనియం తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోను. రేడియో ధార్మిక పదార్థంతో క్యాన్సర్ వస్తుంది. ఆదిమ జాతుల తరలింపునూ ఒప్పుకోను. అటవీ ప్రాంతాల్లో జీవించడం సొంత హక్కు. రాజ్యాంగం రాకముందు నుంచీ వీళ్లు అడవుల్లో ఉంటున్నారు. తరలించడమనేది పూర్తిగా జీవించే హక్కుకు వ్యతిరేకం. ఆర్టికల్ 21, 19కి వ్యతిరేకం.

ఈ ఎన్నికల్లో మీకు ప్రత్యర్థి ఎవరు?

నాకు ప్రధాన ప్రత్యర్థి బీజేపీ. కాంగ్రెస్‌తో పోటీయే లేదు. బీజేపీ-కాంగ్రెస్ కూటమి. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించితేనే దేశం బాగుంటుంది. రాజ్యాంగం రద్దయితే సామాజిక న్యాయం కనుమరుగవుతుంది. వెనకబాటుతనం పెరుగుతుంది. ధనవంతులు మరింత ధనవంతులవుతారు. పేదలు మరింత పేదలవుతారు.

మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందా?

బీజేపీని ఎప్పుడెప్పుడు ఇంటికి పంపిద్దామా అని ప్రజలు చూస్తున్నారు. కేవలం శ్రీరామచంద్రుడు, అక్షింతలతో ఓట్లు దండుకోవాలని ఆ పార్టీ చూస్తున్నది. బీజేపీ లేనప్పుడు, కొన్ని వేల సంవత్సరాల నుంచి మనమంతా హిందువులమే. బీజేపీ రాకముందు నుంచే రామాలయాలు, హిందూ మతం ఉన్నాయి. హనుమాన్ జయంతిని జరుపుకొంటున్నాం. బీజేపీ వచ్చి ఇప్పుడు కొత్తగా చేసిందేమీ లేదు. మతం పేరుతో దేశ ప్రజలను మత్తులో ఉంచి అభివృద్ధికి దూరంగా చీకటిరోజుల్లోకి తీసుకుపోవాలని, మతసామరస్యాన్ని నాశనం చేయాలని చూస్తున్నది. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నది. రాజ్యాంగం రద్దయితే రిజర్వేషన్లు పోతయ్. దేశం అల్లకల్లోలమైతది. మతకల్లోలాలు చెలరేగుతయ్. దేశ ప్రజల ఆస్తి గుజరాత్ సేట్ల దగ్గరికి పోతుందన్నది వాస్తవం. కర్ణాటకలో మహిళలపై లైంగికదాడికి పాల్పడిన రేవణ్ణను మోదీ వెనకేసుకొస్తున్నరు. అలాంటి దుర్మార్గమైన బీజేపీని ఎలా ఆదరిస్తారు. ముచ్చటగా మూడోసారి కాదుకదా మూడు చెరువుల నీళ్లు తాగించి మూడు మీటర్ల లోతైన బొందలో పెట్టాలని చూస్తున్నారు.

● **బీఆర్ఎస్‌కు ఓటెయ్యి అక్కా.. భవిష్యత్తుకు భరోసా పక్కా**



మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత శనివారం బయ్యారం, గంధంపల్లి, కొత్తపేటలలో జడ్పీ చైర్‌పర్సన్ బిందుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడుతూ.. 'నన్ను గెలిపించుండ్రి అక్కా.. మీ బతుకులకు పక్కాగా భరోసా ఇస్తా' అని అభ్యర్థించారు. -బయ్యారం

● **కారుకు జైకొట్టు.. అభివృద్ధికి పట్టం కట్టు**

పార్లమెంట్ ఎన్నికల్లో కారుకు జైకొట్టి.. కేసీఆర్ చేసిన అభివృద్ధికి పట్టం కట్టాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి సత్తా చాటాలని సూచించారు. -నాగర్‌కర్నూల్

● **చిన్నారి తిలకం.. అనిల్‌కు శుభసూచకం**

బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ శనివారం కామారెడ్డి జిల్లా రాజంపేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు ఓ చిన్నారితో వీరతిలకం దిద్దించి ఆశీర్వదించారు. అనంతరం బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. -రాజంపేట్

కేసీఆర్‌కే ఎంబీసీల మద్దతు

హైదరాబాద్, మే11 (నమస్తే తెలంగాణ): పదేండ్ల పాలనలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే తమ మద్దతు ఉంటుందని ఎంబీసీ సంఘాల జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశచరిత్రలో ఎక్కడాలేని విధంగా బీసీ ఎంబీసీ సంచార జాతుల కులాల సంక్షేమమే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు అమలు చేశారని కొనియాడారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతోనే బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా మాయం

గణపురం, మే 11: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 147వ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా మాయమైంది. మరో 24 గంటల్లో పోలింగ్ జరగాల్సి ఉండగా సీసీ కెమెరా మాయమవడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. 147వ పోలింగ్ కేంద్రంలోని గదిలో తలుపు పక్కన రెండు రోజుల క్రితం అధికారులు సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. వేసిన తాళం వేసినట్టే ఉండగా సీసీ కెమెరా మాయమవడం అధికారులకు అంతుపట్టడం లేదు. ఈ ఘటనపై స్థానిక ఎస్సైకి అధికారులు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు.

2.30 కోట్ల విలువైన మద్యం స్వాధీనం

రాజాపూర్ (బాలానగర్), మే 11 గోవా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరానికి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం స్వాధీనం చేసుకొన్నట్టు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. గోవా నుంచి కర్ణాటక మీదుగా ఏపీకి వర్మీకంపోస్టు ఎరువుల లారీలో మద్యం తరలిస్తున్న వాహనాన్ని ఎస్సై తిరుపాజీ పోలీస్ సిబ్బందితో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ చౌరస్తాలో తనిఖీ చేశారు. డ్రైవర్ పారిపోతుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీలో కింది భాగాన మద్యం కాటన్లను పేర్చి.. పైభాగాన వర్మీకంపోస్టు ఎరువు బస్తాలను పేర్చారు. 17,280 లీటర్ల మద్యం లభించగా, రూ.2.30 కోట్ల విలువ ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

ముగిసిన ప్రచారపర్వం

- **లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం**
- **రాష్ట్రమంతటా పటిష్ఠ ఏర్పాట్లు, 144 సెక్షన్**
- **జెండాలు, బ్యానర్లు, లౌడ్‌స్పీకర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం**
- **పత్రికల్లో ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి**
- **రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ స్పష్టీకరణ**

మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. దీంతో రానున్న 48 గంటలపాటు ఎవరూ ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి వికాస్‌రాజ్ స్పష్టంచేశారు. సోమవారం ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై శనివారం ఆయన రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పోలింగ్ ముగిసే వరకు జెండాలు, బ్యానర్లు, డిస్‌ప్లే బోర్డులు, లౌడ్‌స్పీకర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం విధించినట్టు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురు కన్నా ఎక్కువమంది ఒకేచోట గుమిగూడేందుకు వీల్లేదని తెలిపారు. వచ్చే 48 గంటలపాటు ఎలాంటి ఫిర్యాదు అందినా 100 నిమిషాల్లోగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ రెండు రోజుల్లో ఎవరైనా వార్తా పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలనుకుంటే మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఎన్నికలను ప్రభావితం చేసేలా టీవీ చానళ్లలో చర్చా కార్యక్రమాలను నిర్వహించరాదని స్పష్టంచేశారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు విద్యార్థులు, ఎన్జీవోలు, పౌరసంఘాల ద్వారా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని, గతంలో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎక్కువగా ప్రచారం చేశామని చెప్పారు.

ఈవీఎంల వాహనాలకు జీపీఎస్

ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను తరలించే వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటుచేసి, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి నేరుగా పర్యవేక్షించే ఏర్పాట్లు చేసినట్టు సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత వాటిని భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లపై సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లు సైతం చూసే విధంగా ఏర్పాట్లు చేశామని వివరించారు.

జూన్ 1 సాయంత్రం ఎగ్జిట్‌పోల్ ఫలితాలు

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు సోమవారమే పూర్తవుతున్నప్పటికీ దేశవ్యాప్తంగా ఈ ఎన్నికల ప్రక్రియ జూన్ 1 వరకు కొనసాగనున్నది. ఈ నేపథ్యంలో జూన్ 1 సాయంత్రం 6.30 వరకు ఎగ్జిట్‌పోల్ ఫలితాలను వెల్లడించరాదని వికాస్‌రాజ్ స్పష్టంచేశారు. పోలింగ్ నేపథ్యంలో 13న రాష్ట్రంలోని అన్ని రకాల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించామని, దీన్ని ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు చేపడతామని స్పష్టంచేశారు.

విద్వేష ప్రసంగాలపై చర్యలేవి?

ఎన్నికల ప్రచారం సందర్భంగా విద్వేష ప్రసంగాలు చేసిన రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని విలేకరులు సీఈవో వికాస్‌రాజ్‌ను ప్రశ్నించారు. కేసీఆర్‌ను 48 గంటలపాటు ప్రచారానికి దూరంగా ఉంచిన విషయాన్ని విలేకర్లు గుర్తుచేస్తూ.. ప్రధాని మోదీ సహా ఇతర పార్టీల నేతలు చేసిన అభ్యంతరకర ప్రసంగాలపై ఫిర్యాదులేమైనా వచ్చాయా? వస్తే వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. దీనిపై వికాస్‌రాజ్ స్పందిస్తూ.. వివిధ రాజకీయ పార్టీలపై 92 ఫిర్యాదులు అందాయని, ఆయా పార్టీలకు నోటీసులు జారీచేయడంతో సమాధానం ఇచ్చేందుకు సమయం కోరాయని వివరించారు.

13 అసెంబ్లీ స్థానాల పరిధిలో సాయంత్రం 4 వరకే పోలింగ్

నక్సల్ ప్రభావిత ప్రాంతాలైన సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వరావుపేట తదితర 13 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 వరకే పోలింగ్ జరుగుతుంది. ఈ సెగ్మెంట్ల పరిధిలో శనివారం సాయంత్రం 4కే ప్రచారం ముగిసింది. మిగిలిన 106 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది.

ఎన్నికల సిబ్బందికి టీఏ, డీఏలు ఖరారు

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి టీఏ, డీఏలను ఖరారుచేశారు. పీవో, ఏపీవో, కౌంటింగ్ సూపర్‌వైజర్లకు రోజుకు రూ.600, పోలింగ్ అధికారులు, కౌంటింగ్ ఏజెంట్లకు రూ.400, నాలుగోతరగతి ఉద్యోగులకు రూ.300 చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు.

తుది పోలింగ్ శాతం తెలిసేది మరుసటిరోజే

పోలింగ్ సిబ్బందికి ఆదివారం ఉదయం నుంచే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో సామగ్రిని అందజేయనున్నట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు జరిగే మాక్ పోలింగ్‌లో అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. అదే రోజు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యాక ప్రతి 2 గంటలకోసారి పోలింగ్ శాతాన్ని, మరుసటి రోజు తుది పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తామని తెలిపారు. పోలింగ్ పూర్తయ్యాక అన్ని కేంద్రాల నుంచి రిసెప్షన్ సెంటర్లకు ఈవీఎంలను తరలిస్తామని చెప్పారు.

విధుల్లో భద్రతా బలగాలు

- కేంద్ర బలగాలు 160 కంపెనీలు
- రాష్ట్ర పోలీసులు 72,000
- పొరుగు రాష్ట్రాల పోలీసులు 20,000
- ఇతర యూనిఫామ్ సేవల ఉద్యోగులు 4,000

పోలింగ్‌కు ఏర్పాట్లు

- బ్యాలెట్ యూనిట్లు 1,05,019
- కంట్రోల్ యూనిట్లు 44,569
- వీవీ ప్యాట్‌లు 48,134
- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఈసీఐఎల్ ఇంజినీర్లు 3

కేసులు

- ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నమోదైన కేసులు 8,600

ఎన్నికల సిబ్బంది వివరాలు

- పోలింగ్ సిబ్బంది 1,96,000
- సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు 3,522 మంది
- మొత్తం పోలింగ్ కేంద్రాలు: 35,809
- ఆగ్జిలరీ పోలింగ్ స్టేషన్లు 453

తక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు

- మూడు పోలింగ్ కేంద్రాల్లో 10, 12, 14 మంది చొప్పున ఓటర్లున్నారు.
- 25 మందికన్నా తక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 11
- 50 మందికన్నా తక్కువ ఓటర్లున్న కేంద్రాలు 22
- 100 మందికన్నా తక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 54

ఇతర పోలింగ్ వివరాలు

- మైక్రో అబ్జర్వర్లు 12,909
- పోలింగ్ రోజు మొత్తం సిబ్బంది 2,94,000
- ఎంసీఎంసీ ద్వారా ప్రకటనలకు అనుమతులు 559
- సువిధ కింద అనుమతులు 11,112
- సీ-విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు 2,342
- 1950 కాల్ సెంటర్ నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు 511
- ఎన్‌జీఎస్‌పీ (నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్) ద్వారా వచ్చిన ఫిర్యాదులు: 10,526
- ఇప్పటివరకు పోలైన పోస్టల్ బ్యాలెట్లు 1.88 లక్షలు
- హోం ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకున్నవారు 20,163

లక్ష మందితో బందోబస్తు

- **లోక్‌సభ ఎన్నికలకు భద్రత కట్టుదిట్టం**
- **డీజీపీ ఆఫీస్‌లో సెంట్రల్ కంట్రోల్‌రూమ్**
- **మార్చి 16 నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు రూ.186 కోట్లు**
- **8,863 ఎఫ్ఐఆర్‌లు, 34,526 మంది బైండోవర్:డీజీపీ**

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సోమవారం జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు దాదాపు లక్ష మందికిపైగా పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని డీజీపీ రవిగుప్తా శనివారం వెల్లడించారు. 73,414 మంది సివిల్ పోలీసులు, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ విభాగాలకు చెందిన 500 మంది సిబ్బందితోపాటు 164 కంపెనీల సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్, తమిళనాడుకు చెందిన 3 స్పెషల్ ఆర్మ్డ్ కంపెనీలు, ఇతర శాఖలకు చెందిన 2,088 మంది సిబ్బంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 7 వేల మంది హోంగార్డులను వినియోగిస్తున్నట్టు వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి 16 నుంచి మే 10వ తేదీ సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా 482 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 462 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, 89 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 జిల్లా చెక్‌పోస్టుల ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టి రూ.186.14 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకోవడంతోపాటు తెలంగాణ ఎక్సైజ్, ఎన్డీపీఎస్, ఐపీసీ, ప్రజాప్రాతినిధ్య చట్టాల కింద మొత్తం 8,863 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు తెలిపారు. వివిధ నేరాల్లో భాగస్వాములైన 34,526 మందిని బైండోవర్ చేసినట్టు చెప్పారు.

మార్చి 16 నుంచి మే 10 వరకు స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు

సొత్తు	విలువ (రూ.)
నగదు	93,94,43,358
మద్యం	10,07,49,567
డ్రగ్స్	7,86,32,020
ఆభరణాలు	62,77,77,480
ఇతర తాయిలాలు	11,48,88,459
మొత్తం	186,14,90,884

డీజీపీ ఆఫీస్‌లో కంట్రోల్ రూమ్

ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డీజీపీ ఆఫీసులో ప్రత్యేకంగా సెంట్రల్ కంట్రోల్ రూమ్‌తోపాటు పోలీసులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ తెలిపారు. సోమవారం ఉదయం 7 గ